
సాక్షి నిర్మల్
గురువారం । 21 । డిసెంబర్ । 2023



కంది రైతుకు రంది..

ఖరీఫ్‌లో పత్తి, సోయా, మినుము సాగు చేసిన రైతులు దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోయారు. వీటిలో అంతరపంటగా సాగు చేసిన కంది కూడా అన్నదాతను ఆదుకోలేకపోయింది. 9లో▸



దారులన్నీ ధర్మారం వైపే..

లక్ష్మణచాంద మండలం ధర్మారంలో నిర్వహించిన కోతిదేవుడి జాతరకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0 / 14.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చలి తీవ్రత పెరుగుతుంది. వేకువజామున పొగ మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పార్లమెంట్ ఎన్నికలకు సన్నద్ధం కావాలి



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: రానున్న పార్లమెంట్ ఎన్నికలకు ఓటరు జాబితాలను పకడ్బందీగా తయారు చేయాలని, ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేయాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ సూచించారు. బుధవారం ఆయన కలెక్టర్లతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ల జాబితాలో తప్పులు లేకుండా చూడాలని, జాబితాను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదయ్యేలా చూడాలని తెలిపారు. ఓటరు నమోదుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులు వెంటనే పరిష్కరించాలని సూచించారు.

విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించాలి

భైంసాటౌన్: ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు దడిగె భోజన్న సూచించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వ పథకాలకు నమోదు చేసుకోని వారితో నేరుగా దరఖాస్తు చేయించాలని సూచించారు. ఈనెల 25లోగా విశ్వకర్మ యోజనకు అన్ని బూత్‌ల నుంచి ఐదుగురు అర్హులతో సీఎస్సీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకునేలా చూడాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పడిపల్లి గంగాధర్, అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లింబాద్రి, పోశెట్టి, బాజీరావు, పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోండుగూడ సందర్శన



రెవెన్యూ సిబ్బందితో గోండుగూడ వాసులు

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గోండుగూడకు చెందిన ఆదివాసీలు ఈనెల 19న పోడు భూముల విషయమై కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం రెవెన్యూ సిబ్బంది గోండుగూడను సందర్శించారు. గోండుగూడ వాసుల స్థితిగతులు తెలుసుకున్నారు. 20 కుటుంబాలకు.. కుటుంబానికి రెండెకరాల చొప్పున పోడు భూములు కేటాయించాలని కోరారు. రాజ్‌గోండ్ సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఆత్రం రాజేశ్వర్ తదితరులున్నారు.

అర్థమయ్యే రీతిలో బోధించాలి



మాట్లాడుతున్న వినయ్‌బాబు

కుంటాల: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని రూమ్ టు రీడ్ రాష్ట్ర కోఆర్డినేటర్ వినయ్‌బాబు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. ఉపాధ్యాయుల పాఠ్యాశాల బోధనను పరిశీలించి అభినందించారు. అతడి వెంట సభ్యుడు ఎండీ సయ్యద్, హెచ్‌ఎం ఎల్లన్న, ఉపాధ్యాయులు ఉమారాణి, శ్రీనివాస్ తదితరులున్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని ఇటీవల రాష్ట్ర గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయిలో గణిత ప్రతిభ పోటీలు నిర్వహించారు. మండలంలోని ఓలా ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని తహ్నియాత్ అంజుమ్ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. మంగళవారం నిర్మల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో మూడో స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా విద్యార్థినిని డీఈవో రవీందర్‌రెడ్డి అభినందించారు. బుధవారం పాఠశాలలో విద్యార్థినిని ఉపాధ్యాయులు సన్మానించారు. హెచ్‌ఎం రాహుల్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యువోత్సాహం





నృత్యం చేస్తున్న యువతీయువకులు





హాజరైన యువతులతో అదనపు కలెక్టర్, అధికారులు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు అంబరాన్నంటాయి. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ హాజరై వేడుకలు ప్రారంభించారు. 15-29 ఏళ్ల యువతీయువకులు పాల్గొన్నారు. గ్రూప్ సాంగ్, సోలో సాంగ్, డ్యాన్స్, ఫొటోగ్రఫీ, పోస్టర్ మేకింగ్, స్టోరీ రైటింగ్, ప్రకటన తదితర అంశాలపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వారిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. జిల్లా క్రీడలశాఖ అధికారి రఫీక్‌ఖాన్, డీపీఆర్వో తిరుమల, సెక్రటరీ భోజన్న, రమణారావు, పీఈటీలు అన్నపూర్ణ, జమున, శ్రీనివాస్, వినోద్, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేరియంట్ అలర్ట్

- రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం
- అప్రమత్తమైన వైద్య, ఆరోగ్యశాఖ
- జిల్లా ఆస్పత్రిలో ప్రత్యేక వార్డు
- జాగ్రత్తలు తీసుకోవాలన్న వైద్యులు
- ప్రమాదం లేదంటున్న అధికారులు



జనరల్ ఆస్పత్రిలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో ధన్‌రాజ్, ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్

నిర్మల్‌చైన్‌గేట్: కరోనా మహమ్మారి మరోసారి పంజా విసురుతోంది. కొత్త వేరియంట్ జేఎన్–1 తమిళనాడు, కేరళ తదితర రాష్ట్రాల్లో ప్రవేశించింది. అక్కడక్కడా కేసులు కూడా నమోదవుతున్నందున కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం.. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, జిల్లాలో ఆక్సిజన్ నిల్వలు, ఆక్సిజన్ బెడ్లు, మందులు, మాస్కులు, ఆర్టీపీసీఆర్ పరీక్షల కిట్లు, ఇతర సామగ్రి, వైద్యులు, సిబ్బంది వివరాలు అందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖను ఆదేశించింది. జిల్లాలో అందుబాటులో ఉన్న వివరాలను జిల్లా వైద్యారోగ్యశాఖ రాష్ట్ర శాఖ కమిషనర్‌కు నివేదించింది. ఒకవేళ కరోనా కొత్త వేరియంట్ వ్యాప్తి చెందితే తీసుకోవాల్సిన చర్యలు, వైద్యసేవలకు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అనుగుణంగా జిల్లా వైద్యారోగ్యశాఖ సర్వం సిద్ధమైంది.

వ్యాప్తిని అడ్డుకునేలా..

జిల్లాకు పెద్ద దిక్కుగా ఉన్న జనరల్ ఆస్పత్రిలో కరోనా బాధితులకు ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ఒకవేళ వ్యాధి వ్యాప్తి చెందినా, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ తెలిపారు. ఆస్పత్రిలో ఎలాంటి పాజిటివ్ కేసులు నమోదు కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం 10 వెంటిలేటర్లు, 91 ఆక్సిజన్ పడకలు, 100 సాధారణ పడకలు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు.

ఇక్కడే ఆర్టీపీసీఆర్ పరీక్షలు

గతంలో కరోనా పరీక్షలు చేస్తే ఆ రిపోర్ట్ రోగి చేతికందే సరికి మూడు రోజులయ్యేది. ఈ సమయంలో కరోనా వచ్చిందా.. అనే బెంగతో మరింత బలహీనంగా మారి అత్యవసర పరిస్థితికి చేరి ఆస్పత్రిలో జాయిన్ అయిన వారూ ఉన్నారు. ఆర్టీపీసీఆర్ కేంద్రం జిల్లా ఆస్పత్రిలో అందుబాటులోకి రావడంతో ఇప్పుడు పరీక్ష చేసిన రోజే రిపోర్ట్ వస్తుంది. ఉదయం పరీక్ష చేస్తే సాయంత్రం రిపోర్ట్ చేతికందుతుంది. ప్రస్తుతం కరోనా వ్యాప్తిలో ల్యాబ్ సేవలు కీలకం కానున్నాయి.

అందుబాటులో ఆక్సిజన్ ప్లాంట్

ఫస్ట్, సెకండ్ వేవ్ సమయంలో జిల్లా ఆస్పత్రిలో కోవిడ్ బాధితులకు చికిత్స అందిస్తున్న సమయంలో కొన్నిసార్లు ఆక్సిజన్ కొరత వైద్యులను బెంబేలెత్తించింది. గత థర్డ్, ఫోర్త్ వేవ్ జిల్లాలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా స్థానికంగా ఆక్సిజన్ ఉత్పాదక ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇది నిమిషానికి 2వేల లీటర్ల ఆక్సిజన్‌ను ఉత్పత్తి చేస్తుంది. దీంతో ఏకకాలంలో వందల మందికి ప్రాణవాయువు అందించే అవకాశం లభించింది.

మాస్కులు, శానిటైజర్లు తప్పవా?

కరోనా నూతన వేరియంట్ వ్యాప్తి చెందకుండా ప్రజలు మళ్లీ మాస్కులు, శానిటైజర్లు వినియోగించడం పరిపాటిగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఆర్టీసీ బస్సులు మహిళలకు ఉచిత ప్రయాణం మొదలైన నుంచి కిక్కిరిసిపోతున్నాయి. కొంతమంది ఒంటి కాలిపై నిలబడి ప్రయాణించాల్సి వస్తోంది. ఇంత రద్దీలో కరోనా వేరియంట్ వేగంగా వ్యాప్తి చెందేలా ఉందని పలువురు భావిస్తున్నారు.

కేసులు నమోదు కాలేదు



ఇతర రాష్ట్రాల్లో కరోనా కొత్త వేరియంట్ కేసులు నమోదవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తం చేసింది. జిల్లాలో కేసులు లేనప్పటికీ ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు మాస్క్ ధరించాలి. ప్రభుత్వ సూచన మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నాం. ప్రజలు పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– ధన్‌రాజ్, డీఎంహెచ్‌వో

సిద్ధంగా ఉన్నాం



జిల్లా జనరల్ ఆస్పత్రిలో కరోనా చికిత్స చేసేందుకు అన్ని రకాలుగా సిద్ధంగా ఉన్నాం. ఎవరికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. లక్షణాలున్న ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు తీసుకుంటూ మాస్కులు ధరించాలి.

– సునీల్, సూపరింటెండెంట్, జిల్లా జనరల్ ఆస్పత్రి

ఇవీ లక్షణాలు..

జ్వరం, ముక్కు కారడం, గొంతు నొప్పి, తలనొప్పి.. కొందరిలో కడుపు నొప్పి, మరికొందరిలో శ్వాసకోశ సమస్యలు కనిపిస్తాయి. ఈ లక్షణాలు పూర్తి స్థాయిలో కనిపించడానికి నాలుగు నుంచి ఐదురోజుల సమయం పడుతుంది. గత వేరియంట్లతో పోలిస్తే జేఎన్–1 ప్రమాదకరమైందని చెప్పడానికి ఇప్పటికైతే శాస్త్రీయ కారణాలు లేవని అధికారులు చెబుతున్నారు.

సుస్థిర జీవన విధానం అలవాటు చేసుకోవాలి



విద్యార్థులతో ప్రయోగం చేయిస్తున్న విద్యాసాగర్

నిర్మల్ రూరల్: ప్రతి ఒక్కరూ విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానాన్ని అలవాటు చేసుకోవాలని రాష్ట్ర నేషనల్ గ్రీన్ కార్ప్స్ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పార్ ప్రైమ్ పాఠశాలలో బుధవారం ఎన్జీసీ ఆధ్వర్యంలో 'జిల్లా స్థాయి సుస్థిర జీవన విధానం' అనే అంశంపై జిల్లాలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు విద్యార్థి దశలోనే సుస్థిర జీవన విధానాన్ని అలవాటు చేసుకుంటే ప్రకృతి ప్రసాదించిన గాలి, నీరు, నేల కలుషితం కాకుండా కాపాడుకోవచ్చన్నారు. చెత్త నిర్వహణ, కంపోస్టు ఎరువుల తయారీ, గాలి, నీరు, నేల కలుషితం అవుతున్న తీరును అవగాహన కల్పించి స్వయంగా విద్యార్థులతో ప్రయోగం చేసి చూపించారు. పరిశుభ్రత ప్రతీ ఇంటి నుంచి అలవాటు కావాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం ఉంటే వ్యాధులు వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, నిత్యావసరాల కోసం నేలలో సులువుగా కలిసిపోయే వస్తువులను ఉపయోగించాలన్నారు. జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో రాష్ట్ర రిసోర్స్ పర్సన్స్ మేజర్ శివకిరణ్, వెంకటేశ్వర్లు, జిల్లా పరీక్షల సహాయాధికారి పద్మ, ఎన్జీసీ కోఆర్డినేటర్ మోహన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి వినోద్, సెక్టోరియల్ అధికారి నర్సయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాందాస్, వివిధ పాఠశాలల సైన్స్ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత 'కరెంట్'కు బిల్లులు



డీఈ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న రజకులు (ఫైల్)

- ఐదు నెలలైనా రాయితీ సొమ్ము రాలే..
- బకాయిలు చెల్లించాలని నోటీసులు
- ఆందోళనలో రజకులు, నాయీబ్రాహ్మణులు

నిర్మల్‌చైన్‌గేట్: వెనుకబడిన తరగతులకు ఊతమివ్వాలన్న ఉద్దేశంతో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెలూన్లు, లాండ్రీషాపులు, ధోబీఘాట్లకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. దీని ద్వారా జిల్లాలో కులవృత్తిని కొనసాగిస్తూ.. అరకొర ఆదాయంతో జీవితాలు నెట్టుకొస్తున్న ఎంతోమంది నాయీబ్రాహ్మణులు, రజకులకు మేలు చేయాలని భావించింది. కానీ.. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకం పెండింగ్ బిల్లులు గత ప్రభుత్వం చెల్లించలేదు. ఇటీవల నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో రాయితీపై ఎక్కడ ప్రకటన చేయకపోవడంతో విద్యుత్‌శాఖ అధికారులు ఐదునెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని నోటీసులిచ్చారు. దీంతో బిల్లులు చెల్లించలేమని రజకులు మంగళవారం రజక సంఘం ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

2021 ఏప్రిల్ నుంచి అమలు..

నాయీబ్రాహ్మణులు, రజకుల దుకాణాలకు రాష్ట్ర ప్రభుత్వం 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని 1 ఏప్రిల్ 2021లో ప్రారంభించింది. నాటి నుంచి ఇప్పటివరకు రజకులకు సంబంధించిన విద్యుత్ బిల్లులు ప్రభుత్వం చెల్లించలేదు. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు ప్రతీనెల వారికి బిల్లు ఇస్తున్నారు. చెల్లించకపోతే కనెక్షన్ తొలగిస్తున్నారు.

కుల వృత్తుల వారికి..

ఎన్నో ఏళ్లుగా అనేక కుటుంబాలు కులవృత్తిని నమ్ముకున్నా.. ఆర్థికంగా ఎదగలేని పరిస్థితి వారిది. ముఖ్యంగా నాయీబ్రాహ్మణులు, రజకులు అనేక మంది సెలూన్లు, లాండ్రీ షాపులు, ధోబీఘాట్లు ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వచ్చిన తక్కువ ఆదాయంలో పెద్ద ఎత్తున బిల్లులు చెల్లించాల్సి వస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో వీటి ప్రభావం ఎక్కువగా ఉంది. రోడ్డు పక్కన ఉన్న కమర్షియల్ భవనాల్లో షాపులు నిర్వహించడంతో డొమెస్టిక్ భవనాలకు వచ్చే కరెంట్‌కు రెండు రెట్లు అధికంగా బిల్లు చెల్లించాల్సి వచ్చేది. వీరి కష్టాలను అర్థం చేసుకున్న ప్రభుత్వం వారి కోసం ప్రవేశపెట్టిన ఉచిత విద్యుత్ పథకం ఆశించిన మేర లబ్ధిదారులకు చేరడం లేదని పలువురు వాపోతున్నారు.

1,474 మందికి వర్తింపు..

జిల్లా వ్యాప్తంగా 1,474 మంది నాయీబ్రాహ్మణులు, రజకులు ఉచిత విద్యుత్ పథకానికి ఎంపికయ్యారు. 616 సెలూన్ షాపులు, 858 లాండ్రీ షాపుల నిర్వాహకులు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

నోటీసులివ్వడం సరికాదు



ఐదు నెలలుగా ప్రభుత్వం నుంచి బకాయిలు అందలేదని విద్యుత్‌శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని నోటీసులిస్తున్నారు. ఒకేసారి ఇంత మొత్తంలో డబ్బు చెల్లించడం మా వల్ల కావడం లేదు. అధికారుల తీరు సరికాదు.

– ఉషన్న, రజక సంఘం జిల్లా అధ్యక్షుడు

పథకాన్ని కొనసాగించాలి



గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రజకులు, నాయీబ్రాహ్మణులకు 250 యూనిట్లలోపు విద్యుత్ ఉచితంగా అందజేసింది. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ పథకాన్ని కొనసాగించాలి. నిరుపేద రజకులు, నాయీబ్రాహ్మణులకు న్యాయం చేయాలి.

– భోజన్న, నిర్మల్

ఒత్తిడి చేయడం లేదు

గత ప్రభుత్వం రజకులు, నాయీబ్రాహ్మణులకు అమలు చేస్తున్న ఉచిత విద్యుత్‌కు సంబంధించి బకాయిలు చెల్లించమని ఎవరినీ ఒత్తిడి చేయడం లేదు. 250 యూనిట్లలోపు ఉన్న వారందరికీ ఉచితంగా విద్యుత్ ఇస్తున్నాం. 250 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ ఉపయోగించినవారు బిల్లు చెల్లించాల్సి ఉంటుందని చెప్పాం. ఏసీడీ చార్జీలు కూడా తప్పకుండా చెల్లించాలి.

– డీ నాగరాజు, విద్యుత్‌శాఖ డీఈ

'ఇథనాల్'పై ఆందోళనలు ఉధృతం



రాస్తారోకో చేస్తున్న దిలావర్‌పూర్, గుండంపల్లి వాసులు

- నిర్మల్–భైంసా రహదారిపై రాస్తారోకో
- కర్మాగారం ఎత్తివేయాలని డిమాండ్

దిలావర్‌పూర్: మండలంలోని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల మధ్య పంటపొలాల్లో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారంపై ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. బుధవారం దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల ప్రజలు, రైతులు ఇథనాల్ కర్మాగారం వద్దని నిర్మల్–భైంసా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. కర్మాగారానికి వెళ్లే రోడ్డు మార్గాన్ని తవ్వేశారు. ఈ సందర్భంగా ఇథనాల్ కర్మాగార వ్యతిరేక పోరాట కమిటీ సభ్యులు కట్కం రాజారెడ్డి, నవీన్, నర్సయ్య తదితరులు మాట్లాడారు. తాము స్వయాన కర్మాగారాన్ని పరిశీలించి వచ్చామని తెలిపారు. కర్మాగారం నిర్మాణం పూర్తయితే దుష్పరిణామాలుంటాయని వెల్లడించారు. దాదాపు రెండుగంటలపాటు రాస్తారోకో చేపట్టగా.. 'కలెక్టర్, ఉన్నతాధికారులతో మాట్లాడిస్తాం' అని పోలీసులు నచ్చజెప్పగా ఆందోళన విరమించారు.



కర్మాగారానికి వెళ్లేరోడ్డు తవ్విస్తున్న స్థానికులు

బంద్ విజయవంతం

ఇథనాల్ కర్మాగారానికి వ్యతిరేకంగా బుధవారం చేపట్టిన దిలావర్‌పూర్ మండల బంద్ విజయవంతమైంది. మండల కేంద్రంలో ఉదయం నుంచి రాత్రి వరకు దుకాణా సముదాయాలు, పాఠశాలలు, అన్ని ప్రైవేట్ సంస్థలు బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలిపాయి. ఇథనాల్ కర్మాగార వ్యతిరేక పోరాటానికి మద్దతు పలికిన నాయకులు, విద్యార్థులకు పోరాట సమితి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. ముున్ముందు మరిన్ని పోరాటాలు చేస్తామని వారు హెచ్చరించారు.

పోరాటం ఆపేది లేదు



దిలావర్‌పూర్ సమీపంలో నిర్మిస్తున్న ఇథనాల్ కర్మాగారాన్ని తరలించేవరకూ పోరాటం ఆపం. చిత్తనూరు గ్రామస్తులు, పరిసర ప్రజలు పడుతున్న బాధలు కళ్లారా చూశాం. దిలావర్‌పూర్, గుండంపల్లి, టెంబుర్ని, బన్సపల్లి, న్యూలోలం, కంజర్ గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవు. పోరాటానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– కట్కం రాజారెడ్డి, ఇథనాల్ వ్యతిరేక పోరాట కమిటీ సభ్యుడు

న్యాయం చేయాలి



దిలావర్‌పూర్‌లో ఇథనాల్ కర్మాగార నిర్మాణ పనులు పోలీసుల పహారాలో కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం కల్పించుకుని మాకు న్యాయం చేయాలి. ఫ్యాక్టరీ పూర్తయితే మేమంతా తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తుంది. దీనికి వ్యతిరేకంగా ఎంతటి పోరాటానికైనా మేము సిద్ధం.

– కధం సాయినాథ్‌పాటిల్, వీడీసీ యువజన సభ్యుడు, దిలావర్‌పూర్

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్, డిగ్రీ, సాధారణ వృత్తి నైపుణ్య కోర్సులు చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వీ.రాజేశ్వర్‌గౌడ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీలోపు www.telanganaepass.cgg.gov.inలో దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉన్నట్లు పేర్కొన్నారు.

నేడు పాలిటెక్నిక్ కళాశాలలో టెక్‌ఫెస్ట్

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం సజన టెక్ ఫెస్ట్–2023 పోటీలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో మెకానికల్ ఇంజినీరింగ్, ఇతర అనుబంధ కోర్సులు చదివే విద్యార్థులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలోని మెకానికల్ ఇంజినీరింగ్ అధికారి రాంబాబును సంప్రదించాలని సూచించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు


ఎంపికైన విద్యార్థినులు

బేల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు ఎస్.అచల్ (ఇంటర్ సెకండ్ ఇయర్), కాసుబాయి (10వ)లు ఈ నెల 22న కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రన్నింగ్ విభాగంలో ఎంపికైనట్లు ఎస్‌వో గేడం నవీన, పీఈటీ సీహెచ్ తాయిలు తెలిపారు. బుధవారం ఈ ఇద్దరు విద్యార్థినులు జిల్లాస్థాయి అండర్–20 విభాగంలో జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జరిగిన రన్నింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వారిని సీఆర్టీలు, అధ్యాపకులు అభినందించారు.

కాంస్య పతకం సాధించిన జిల్లా జట్టు

ఆదిలాబాద్: జిల్లా హాకీ జట్టు వనపర్తిలో జరుగుతున్న 67వ ఎస్జీఎఫ్ అండర్ 17 రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో కాంస్య పతకంతో సత్తా చాటింది. సెమీఫైనల్‌లో నల్గొండ జట్టుతో జరిగిన పోరులో 2–1 గోల్స్ తేడాతో తృటిలో విజయాన్ని చేజార్చుకున్న జిల్లా జట్టు, మూడవ స్థానం కోసం జరిగిన మ్యాచ్‌లో కరీంనగర్ జట్టును 3–0 సున్నా గోల్స్ తేడాతో ఓడించి విజేతగా నిలిచిందని ఎస్జిఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు తెలిపారు. జిల్లా జట్టు విజేతగా నిలవడంపై జిల్లా విద్యాశాఖ అధికారిని ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, తెలంగాణ హాకీ జట్టు పరిశీలకుడు రవీందర్ అభినందించారు.

పెట్రోకార్ సిబ్బందిపై దాడి

సోన్: మండలంలోని పెట్రోకార్ సిబ్బందిపై దాడికి ప్రయత్నించిన మాధాపూర్ గ్రామానికి చెందిన ఐదుగురిని బుధవారం నిర్మల్ మెజిస్ట్రేట్ రిమాండ్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్లితే.. డిసెంబర్ 15 అర్ధరాత్రి మాధాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు పక్కన పెసరి మురళీ, పెసరి నవీన్, బర్మా ప్రవీణ్, పెసరి దామోదర్, మేకల నిఖిల్‌లు ఐదుగురు మద్యం సేవిస్తుండగా 100కు సమాచారం రావడంతో పెట్రోకార్ సిబ్బంది ఏపీసీ సతీష్, శేఖర్ అక్కడికి వెళ్లారు. దీంతో ఆ ఐదుగురు వ్యక్తులు పోలీస్ సిబ్బందిని బూతులు తిడుతూ, కారు మిర్రర్‌ను ధ్వంసం చేశారు. సోన్ ఏస్సై సంతోషం రవీందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వారిని బుధవారం అరెస్టు చేసి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై కేసు

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల గ్రామంలో కుల బహిష్కరణకు పాల్పడిన వారిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... పడకండి రమేష్, సై రెడ్డి సుధాకర్ వ్యవసాయ భూమి విషయంలో గురుడు కాపు సంఘ సభ్యులు జోక్యం చేసుకున్నారు. పొలానికి వెళ్లే దారి విషయంలో పంచాయితీ పెట్టి తీర్పు ఇవ్వడమే కాకుండా రమేష్ కుటుంబాన్ని కుల బహిష్కరణ చేసి వారితో ఎవరైనా మాట్లాడితే జరిమానా విధిస్తామని, అయ్యప్ప మహా పడిపూజకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ విషయమై బాధితుడు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు గురుడు కాపు సంఘానికి చెందిన సైకిల్ నర్సారెడ్డి, మహిపాల్, పెద్దోళ్ల రాజారెడ్డి, అద్దె శ్రీను, మర్రోల రవి, నలిమెల సుధాకర్, పడకంటి చిన్నారెడ్డి, పడకంటి గణేష్, పడకంటి రాజు, లింగారెడ్డి, టమోటో సైరెడ్డి, సుధాకర్ అనే వ్యక్తులపై కేస్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పేర్కొన్నారు.











కిక్కిరిసిన బస్టాండ్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' పథకంతో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో బుధవారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ మహిళా ప్రయాణికులతో కిటకిటలాడింది. కనిపించిన ప్రతీ బస్సు పోటెత్తిన ప్రయాణికులతో కనిపించింది. దాదాపు ఒకేరోజు 45వేల మంది వరకు ప్రయాణికులు ప్రయాణించినట్లు ఆర్టీసీ అధికారుల పేర్కొన్నారు. బస్సులో సీట్ల కోసం పురుషులకు ఫీట్లు తప్పలేదు. బస్సులు ప్లాట్ ఫారంపైకి రానివ్వకుండా పోటీపడి సీటు కోసం కిటికిలో నుంచి పలువురు బస్సులోకి దూరారు. ప్రమాదం ఏదైనా జరిగితే ఎవరు బాధ్యులని ఆర్టీసీ అధికారులు వాపోతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్

కడెం క్రాప్ హాలీడే

- ప్రస్తుతం ప్రాజెక్టులో నీటినిల్వలు 4.02 టీఎంసీలు
- 1.2 టీఎంసీలతో చెరువులు, కుంటలు నింపే యోచనలో అధికారులు
- యాసంగిలో పంటలకు నీరందించని పరిస్థితి
- నిరాశలో ఆయకట్టు రైతులు


కడెం ప్రాజెక్ట్

జన్నారం(ఖానాపూర్): కడెం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గిపోయాయి. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా చివరి ఆయకట్టుకు నీరందలేదు. వారబంధీ విధానంతో నీరందించారు. అయినా కొందరు రైతుల పొలాలకు నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోయాయి. దీంతో ప్రస్తుతం ప్రధాన కెనాల్‌కు నీరు ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. ఈ రబీ సీజన్‌లో క్రాప్ హాలీడే ప్రకటించే యోచనలో అధికారులు ఉన్నారు. వేసవిలో నీటికి ఇబ్బంది రాకుండా చెరువులు, కుంటలు నింపేందుకు మాత్రమే నీటిని వదిలే అవకాశం ఉంది.

68,150 ఎకరాల్లో సాగు..

కడెం ప్రాజెక్టు ద్వారా నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలో 68,150 ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలు కురియడంతో కడెం ప్రాజెక్టు తెగిపోయే పరిస్థితి ఏర్పడింది. నైజాం కాలంలో నిర్మించిన ప్రాజెక్టు కావడంతో గేట్లు మొరాయించడం, పలు కారణాల వల్ల వర్షాకాలంలో వచ్చిన నీరంతా వృథాగా పోయింది. మిగిలిన నీటితో ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీరందించడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గింది. ప్రాజెక్టు పరిధిలోని 1 నుంచి 8 డిస్ట్రిబ్యూటరీలు కడెం, దస్తురాబాద్ మండలాలు, 9 నుంచి 22 డిస్ట్రిబ్యూటరీలు జన్నారం మండలం, 23 నుంచి 28 డిస్ట్రిబ్యూటరీలు దండేపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలంలో నీటిని అందిస్తాయి. జన్నారం మండలంలో కడెం జలాశయంలోని డీ 9 నుంచి 22 వరకు సుమారుగా 13 వేల ఎకరాలు, డీ 22 నుంచి 28 వరకు దండేపల్లి, లక్సెట్టిపేట, హాజీపూర్ మండలాల వరకు సుమారుగా 40 వేల ఎకరాల వరకు నీరందిస్తుంది.

చెరువులు నింపడంతోనే సరి..

కడెం జలాశయంలో నీరు లేకపోవడంతో యాసంగి సీజన్‌లో పంటలకు నీరందించే పరిస్థితి లేదు. ప్రస్తుతం కడెం ప్రాజెక్టులో 4.02 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో మూడు టీఎంసీల నీరు స్టోరేజీ ఉండగా కేవలం 1.02 టీఎంసీల నీటితో రబీ పంటకు నీరందించే పరిస్థితి లేదని తెల్పిచెప్పేశారు. గతేడాది ప్రాజెక్టులో 6 టీఎంసీల నీరున్నా రబీ సీజన్‌లో పంటలకు నీరిందించేందుకు ఇబ్బంది పడాల్సి వచ్చింది. ప్రస్తుతం 4 టీఎంసీల నీటితో పంటలకు సరిపడా నీరందించే పరిస్థితి లేదు. దీంతో ఉన్న 1.02 టీఎంసీల నీటితో కడెం ఆయకట్టు కింద గల చెరువులు, కుంటలను నింపి వేసవిలో నీటికి ఇబ్బంది కలుగకుండా చూసేందుకు అధికారులు యోచిస్తున్నారు. కాగా వానాకాలంలో మంచి పంటలు పండించిన రైతులు ప్రస్తుత యాసంగిలో పంటలు సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. కొందరు రైతులు ఇప్పటికే వరి నారు మడులు సిద్ధం చేశారు. ప్రాజెక్టు నీటిని వదులుతారనే ఆశతో ఉన్న రైతులకు క్రాప్ హాలీడే నిరాశ నింపే అవకాశం ఉంది.

> **ఉన్నతాధికారులతో చర్చిస్తున్నాం**
>
> కడెం ప్రాజెక్టులో ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు మాత్రమే నిల్వఉంది. ఈ నీటితో రబీ పంటలకు నీటిని వదలడం సాధ్యం కాదు. ఉన్నతాధికారులతో చర్చలు జరుగుతున్నాయి. రబీ సాగుకోసం కాకుండా ఆయకట్టు కింద చెరువులు, కుంటలు నింపేందుకు నీటిని విడుదల చేసేందుకు చర్చిస్తున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నీటిని విడుదల చేయడం జరుగుతుంది.
>
> – బోజేదాస్, డీఈ, కడెం ప్రాజెక్ట్

లంబాడాల తొలగింపుపై అసెంబ్లీలో ప్రస్తావించాలి

- తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న అరుణ్ కుమార్

ఆదిలాబాద్‌రూరల్: అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీ ఎమ్మెల్యేలు రాజ్యాంగంలో అక్రమంగా 324 ఆర్టికల్ ఆమోదం లేకుండా ఎస్టీ జాబితాలో కొనసాగుతున్న లంబాడాలు ఎస్టీ కాదనే అంశంపై అసెంబ్లీలో ప్రస్తావించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ కోరారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలోని ఆదివాసీ భవనంలో తుడుందెబ్బ ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఎన్నిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వారు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లంబాడాలు ఎస్టీ జాబితాలో కలిపి 47ఏళ్లు అవుతున్నప్పటికీ వారు కేవలం జీవో 149 ద్వారా నేటికీ కొనసాగుతున్నారన్నారు. కేవలం ఆదివాసీలు ఎమ్మెల్యేలుగా మంత్రులుగా గెలిస్తే ఉపయోగం లేదన్నారు. ఐటీడీఏలో జరగాల్సిన ప్రమోషన్లు, బదిలీలు 5వ షెడ్యూల్‌కి విరుద్ధంగా జీఓ 317 పేరిటా నూతన జోనల్ పద్ధతిలో ఉద్యోగులు ఆగం అవుతున్నారన్నారు. ఈ అంశాలు అన్ని మాట్లాడాల్సిన అవసరం ఆదివాసీ ఎమ్మెల్యేలపై ఉందన్నారు. లేదంటే ఆదివాసీల భవితవ్యం ప్రశ్నార్థకమవుతుందన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా పుర్క బాపురావ్, ప్రధాన కార్యదర్శిగా వెట్టి మనోజ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నైతం రమేష్‌లను ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొట్నాక్ విజయ్, జల్కే పాండురంగ్, సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, పోలిట్ బ్యూరో చైర్మన్ మెస్రం మోతిరాం, సభ్యులు ఉయికే సంజీవ్, సహాయ కార్యదర్శి జంగు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో రాణిస్తున్న జిల్లా క్రీడాకారులు

- జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి


పోటీలను ప్రారంభిస్తున్న పార్థసారథి

ఆదిలాబాద్: అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణిస్తున్నారని జిల్లా గిరిజన క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ క్రాస్ కంట్రీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అథ్లెటిక్స్ ఈవెంట్లో విజేతగా నిలవాలంటే నిరంతరం సాధన చేయాలన్నారు. నిత్యం సాధన చేస్తూ నైపుణ్యాలను అలవర్చుకోవాలన్నారు. అథ్లెటిక్స్ క్రీడల్లో గెలుపొందితే మంచి గుర్తింపు లభిస్తుందని తెలిపారు. జిల్లాకు చెందిన క్రీడాకారులు అథ్లెటిక్స్ ఈవెంట్‌లో ప్రతిభను కనబరుస్తుండడం హర్షణీయమన్నారు. గొప్పగా సాధన చేసి రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మెరవాలని ఆకాంక్షించారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ రాజేష్ మాట్లాడుతూ అండర్ 16, 18, 20 విభాగాల్లో బాలికలు, బాలురు, మహిళలు, పురుషులకు పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈనెల 23వ తేదీ నుంచి కామారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయిలో రాణిస్తే గయాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాంతారావు, శిక్షకులు రాకేష్, మజీద్, సౌమ్య ఉన్నారు.

గృహప్రవేశం చేసిన మూడురోజులకే

- గుండెపోటుతో నిద్రలోనే యువకుడి మృతి


రవి (ఫైల్)

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీకి చెందిన జోగు లక్ష్మి–నర్సయ్య దంపతులకు నలుగురు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మూడో కుమారుడు రవి (34) గల్ఫ్ నుంచి వచ్చి పలు శుభకార్యాలను ముగించుకున్నాడు. ఆ ఆనందం తీరక ముందే గుండెపోటు రూపంలో మృత్యువు కబలించింది. స్థానికుల వివరాల ప్రకారం... నూతన గృహప్రవేశాన్ని పురస్కరించుకుని రవి నెలరోజులు సెలవుపై ఈ నెల 6న స్వదేశానికి వచ్చాడు. ఈ నెల 17న బంధువులను పిలిచి గృహప్రవేశం సైతం చేశాడు. 18న ఇంట్లో పూజలు, వ్రతాలు పూర్తి చేసుకున్నాడు. 19న బంధువులంతా ఇంట్లోనే ఉన్నారు. ఇంటికి కట్టిన పచ్చని తోరణాలు కనీసం వాడిపోకుండా అలాగే ఉన్నాయి. రాత్రి ఇంట్లో పడుకున్న అతడు నిద్రలోనే గుండెపోటుతో మృతిచెందాడు. అతడికి భార్య సుమ, కుమారుడు, కూతురున్నారు. లక్ష్మి నర్స య్య దంపతుల పెద్ద కుమారుడు నరేందర్ విద్యుత్ షాక్‌తో 20ఏళ్ల క్రితం మృతి చెందాడు. రెండో కుమారుడు రాజేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడు నవీన్ ప్రస్తుతం గల్ఫ్‌లో ఉంటున్నాడు. ముగ్గురు కుమారులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రుల రోదనలు కలిచివేశాయి.

శబరిమలకు మహాపాదయాత్ర


దర్శనం పూర్తి చేసుకున్న అయ్యప్పస్వాములు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లా కేంద్రం నుంచి కేరళ రాష్ట్రంలోని అయ్యప్ప దేవస్థానం శబరిమలకు పాదయాత్ర ద్వారా బయలుదేరిన అయ్యప్ప స్వాముల బృందం బుధవారం చేరుకున్నారు. అనంతరం హరిహరసుతుడైన మణికంఠ దర్శనాన్ని పూర్తి చేసుకున్నారు. గత నవంబర్ 9వ తేదీన జిల్లా కేంద్రానికి చెందిన జి.శ్రీనివాస్ గురుస్వామి ఆధ్వర్యంలో తలపెట్టిన మహాపాదయాత్ర దాదాపు 1500 కిలో మీటర్లు ప్రయాణించి అయ్యప్ప స్వామి క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా భక్తబృందం సభ్యులు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి కరుణాకటాక్షాలతోనే 13వ సారి ఈ మహా పాదయాత్ర పూర్తి చేసుకున్నామని పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలు అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: దివ్యాంగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని తెలంగాణ దివ్యాంగుల పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సత్తి సాయన్న ఓ ప్రకటనలో తెలిపారు. దివ్యాంగుల సంక్షేమ శాఖను మహిళా శిశు సంక్షేమశాఖలో విలీనం చేయడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగుల కోసం ప్రత్యేకశాఖ ఏర్పాటు చేసి బడ్జెట్ కేటాయించాలని కోరారు. మహిళల మాదిరి బస్సులో దివ్యాంగులకూ ఉచిత ప్రయాణం అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు రూ.6 వేల పెన్షన్ అందించడం అభినందనీయమన్నారు.

ఒకే కాంటాతో తూకం..


ఒకే కాంటా ద్వారా పత్తి తూకం చేస్తున్న దృశ్యం


పత్తి వాహనాలతో బారులు తీరిన రైతులు

- ఇబ్బందులు పడుతున్న రైతులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని దర్శన జిన్నింగ్ మిల్లులో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లను చేపడుతున్నారు. అయితే జిన్నింగ్ మిల్లులో తూకాలు చేయడానికి రెండు కాంటాలు ఉన్నప్పటికీ ఒకే కాంటా ద్వారా తూకం చేస్తున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి పత్తిని తీసుకొస్తున్న రైతన్నలు బారులు తీరాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత మార్కెట్ కమిటీ అధికారులను అడిగితే పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా రెండు కాంటాల ద్వారా తూకం జరిగేలా చూడాలని కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక


వైష్ణవిని అభినందిస్తున్న కేజీబీవీ ఉపాధ్యాయులు

ముధోల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆర్.సవిత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఆదిలాబాద్‌లో జరిగిన ఉమ్మడి జిల్లా జోనల్ లెవెల్ అండర్–17 బాలబాలికల కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచింది. రాష్ట్రస్థాయికి ఎంపికై హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొననుంది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సర్పంచ్ వెంకటాపూర్ రాజేందర్, ఎంపీపీ ఆయేషా అఫ్రోజ్‌ఖాన్, ఎంపీటీసీ సభ్యులు సరళ శ్రీనివాస్‌గౌడ్, దేవోజీ భూమేశ్, పాఠశాల చైర్మన్లు విద్యార్థినిని అభినందించారు.

సోన్: మండలం కేజీబీవీకి చెందిన పదో తరగతి విద్యార్థిని ఎం.వైష్ణవి హన్మకొండలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు బుధవారం ప్రత్యేకాధికారి లతాదేవి, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రియాంక తెలిపారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించిన జోనల్‌స్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు. వైష్ణవిని ఉపాధ్యాయులు అభినందించారు.

బస్సు ఎక్కుతుండగా బంగారం చోరీ


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఏడుతులాల బంగారం చోరీకి గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ గైని మౌనిక ఆదిలాబాద్‌లోని పుట్టింటికి బయలుదేరింది. డైరెక్ట్ బస్సు దొరకపోవడంతో నిర్మల్ బస్సు ఎక్కింది. దీంతో నిర్మల్ బస్టాండ్‌లో దిగి ఆదిలాబాద్ బస్సు ఎక్కే క్రమంలో రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆమె బ్యాగ్‌లో నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఏడు తులాల బంగారం చోరీ చేశాడు. ఆమె ఒకసారి బ్యాగు చెక్ చేసుకోగానే బంగారం లేకపోవడంతో ఆర్టీసీ కంట్రోల్ రూమ్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ ఎస్సై రాజేశ్వర్ తెలిపారు.

డ్రైవర్ అజాగ్రత్త.. విద్యార్థికి గాయాలు


గాయాల పాలైన విద్యార్థి

నేరడిగొండ: మండలంలోని కుప్టి జాతీయ రహదారిపై ఉదయం టాటా మ్యాక్స్ వాహనాన్ని అజాగ్రత్తగా నడపడంతో ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. బుధవారం ఇచ్చోడ వైపు నుంచి టాటా మ్యాక్స్ వాహనంలో ముక్రా గ్రామానికి చెందిన విద్యార్థులను తీసుకొస్తుండగా డ్రైవర్ అజాగ్రత్త కారణంగా డివైడర్‌పైకి దూసుకెళ్లింది. దీంతో ఇందులోని ఓ విద్యార్థికి గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం ఇచ్చోడ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై మారుతి వివరించారు.

అధిక సాంద్రతతో ఎక్కువ దిగుబడి


పత్తిని చూపిస్తున్న ఏడీఏ

పెంబి: పత్తిని అధిక సాంద్రత విధానంలో సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని ఖానాపూర్ ఏడీఏ సుజాత తెలిపారు. బుధవారం మండలంలోని ఇటిక్యాల్ గ్రామానికి చెందిన రైతు అధిక సాంద్రత విధానంలో సాగు చేసిన పత్తి పంటను ఆమె పరిశీలించి మాట్లాడారు. అధికసాంద్రత విధానంలో పత్తి సాగు చేస్తే ఎకరాకు సుమారు 14క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని, గతేడాది ఇదే భూమిలో పత్తి సాగు చేయగా 10క్వింటాళ్లు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. ఏఈవో రాజ్‌కుమార్, రైతులున్నారు.

అస్తవ్యస్తంగా బల్దియా పాలన

- అందుబాటులో ఉండని అధికారులు


పట్టణ ప్రణాళిక విభాగంలోని టీపీవో..


ఉదయం 11.30గంటలు తరువాత.. కమిషనర్ కుర్చీ

కైలాస్‌నగర్: గ్రేడ్–1 స్థాయి కలిగిన ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిపాలన అస్తవ్యస్తంగా మారింది. బల్దియా అధికారులు సమయపాలన పాటించడం లేదు. ఫీల్డ్ విజిట్ పేరిట కార్యాలయానికి సకాలంలో హాజరుకావడం లేదు. మున్సిపల్ వ్యవహారాలను పర్యవేక్షించాల్సిన జిల్లా ఉన్నాతాధికారులు ఆదిశగా దృష్టి సారించకపోవడంతో బల్దియా అధికారులు విధులకు వచ్చిందే సమయం అన్నట్లుగా పరిస్థితి మారిపోయింది. దీంతో వివిధ పనుల నిమిత్తం ఆయా విభాగాలకు వచ్చే ప్రజలు అధికారుల్లేక ఖాళీ కుర్చీలను చూసి వెనుదిరుగాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. అధికారులు కార్యాలయంలో ఎప్పుడు అందుబాటులో ఉంటారో కూడా తెలియని దుస్థితి తలెత్తింది. బుధవారం సాక్షి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించగా ఉదయం 11.35 గంటలు దాటినప్పటికి ఒక్క రెవెన్యూ అధికారి మినహా మిగతా అధికారులేవరూ ఆయా విభాగాల్లో అందుబాటులో లేకపోవడం బల్దియా పాలన గాడి తప్పిందనేందుకు నిదర్శనంగా నిలుస్తోంది.


హరితహారం డీఈ కుర్చీ


పారిశుధ్య విభాగంలోని శానిటరీ ఇన్‌స్పెక్టర్ కుర్చీ


ఇంజనీరింగ్ విభాగంలో ఖాళీగా ఉన్న ఎంఈ కుర్చీ